క్లుప్తంగా

ప్రణాళికా బద్ధంగా చదివితే ఉత్తమ ఫలితాలు

ఎంఈఓ చంద్రప్ప


అల్పాహారాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ చంద్రప్ప

బంట్వారం: పదోతరగతి విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా చదివితే ఉత్తమ ఫలితాలు సాధించొచ్చని ఎంఈఓ చంద్రప్ప పేర్కొన్నారు. శనివారం ఆయన కోట్‌పల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో పదోతరగతి విద్యార్థులకు అల్పాహారాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నందునా వారికి అల్పాహారం అందజేస్తున్నామన్నారు. ప్రతి విద్యార్థికి రూ. 15 ఖర్చు చేస్తున్నామన్నారు. ఇష్టంతో చదివి అనుకున్న లక్ష్యాన్ని సాధించాలన్నారు. మెనూ ప్రకారం అల్పాహారం ఇస్తామన్నారు. ఉడకబెట్టిన పెసర్లు, పల్లీలు బెల్లం, చిరు ధాన్యాలతో చేసిన మిల్లెట్ బిస్కెట్స్, ఉడకబెట్టిన బొబ్బర్లు, ఉల్లిపాయ పకోడి, ఉడకబెట్టిన శనగలు ఇస్తారన్నారు.

కేరెళ్లి సత్యసాయి కన్వీనర్‌కు పీహెచ్‌డీ పట్టా


పీహెచ్‌డీ అందుకుంటున్న రామకృష్ణారెడ్డి

ధారూరు: కేరెళ్లి శ్రీసత్యసాయి సేవా సమితి కన్వీనర్‌గా వ్యవహరిస్తున్న కె రామకృష్ణారెడ్డి పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. కంప్యూటర్ సైన్స్, ఇంజనీరింగ్ విభాగంలో ఇమేజ్ మైనింగ్ టెక్నిక్‌లభిన్నమైన అవసరం అనే అంశంపై పరిశోధన పూర్తి చేశారు. ఈ సందర్భంగా భగవంత్ విశ్వవిద్యాలయం, అజ్మీరి నుంచి గత నెల 25న పీహెచ్‌డీ పట్టా అందుకున్నారని శనివారం శ్రీసత్యసాయి గ్రామీణ సార్వజనిక కేంద్రం ప్రధాన కార్యదర్శి ఎం. ప్రేంకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, కేంద్రం ప్రధాన కార్యదర్శి, కోషాధికారి ప్రేంకుమార్, వెంకట్రాంరెడ్డిలు, స్నేహితులు అభినందనలు తెలిపారు.

రోడ్డు వెంబడి చెట్ల తొలగింపు


చెట్లను తొలగిస్తున్న జేసీబీ

దౌల్తాబాద్: అల్లాపూర్ నుంచి దౌల్తాబాద్ గ్రామం వరకు బీటీ రోడ్డు వెంబడి అడ్డంగా ఉన్న చెట్లను తొలగించారు. రోడ్డు వెంబడి పెరిగిన చెట్లతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ విషయాన్ని గ్రామస్తులు మండల కాంగ్రెస్ నాయకుడు హన్మంతుకు వివరించారు. ఆయన తన సొంత డబ్బులు వెచ్చించి శనివారం జేసీబీతో చెట్లను తొలగింపజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు హన్మంతుకు కృతజ్ఞతలు తెలిపారు.

సిద్ధనొంపు ఆలయంలో పూజలు


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

కొడంగల్ రూరల్: పట్టణశివారులోని సిద్ధనొంపు పడమటి అంజనేయస్వామి ఆలయంలో శనివారం ఆర్‌ఎస్‌ఎస్, హిందూవాహిని, భక్తుల సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం దూప, దీపాలనంతరం భక్తులు సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఆంజనేయ స్వామి అష్టోతర శతనామావళి, మంగళహారతి ఇచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

ప్రశంసాపత్రం అందజేత

దౌల్తాబాద్: మండలంలోని యాంకి గ్రామానికి చెందిన చిత్రాకారుడు అశోక్‌కు న్యూఢిల్లీకి చెందిన వర్తివెల్నెస్ ఫౌండేషన్ సంస్థ వారు ప్రశంసాపత్రాన్ని అందజేశారు. జనవరి 30న గాంధీ వర్ధంతి సందర్భంగా దేశంలో పలు రంగాల్లో సేవలందిస్తున్న ప్రతిభా మూర్తులను గుర్తించి వారికి ప్రశంసాపత్రాలను అందిస్తుంటారు. ఈ క్రమంలో చిత్రాకారుడు అశోక్‌కు చిత్రకళా సేవకు గుర్తింపుగా జాతిపిత స్మృతిలో సర్వోదయ కర్మయోగి సమ్మాన్ ప్రశంసాపత్రాన్ని ఫౌండర్ వ్యవస్థాపకుడు మాన్సిబాజ్‌పాయ్ ఆన్‌లైన్ వేదికగా అందజేసినట్లు అశోక్ తెలిపారు.

పేరుకు పల్లె.. లబ్ధిలో భలే

- ఫైలెట్ ప్రాజెక్టుకింద నాగిరెడ్డిపల్లి ఎంపిక
- సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం
- నాగిరెడ్డిపల్లిలో గ్రామస్తుల సంక్షేమ హర్షం


సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న గ్రామ నాయకులు



గ్రామ పంచాయతీ నూతన భవనం

బొంరాస్‌పేట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన నాలుగు సంక్షేమ పథకాల అమలు కోసం మండలానికి ఒక గ్రామం చొప్పున ఎంపికైంది. బొంరాస్‌పేట మండలం నుంచి నాగిరెడ్డిపల్లి ఇందులో చోటు దక్కించుకుంది. ఈ గ్రామంలో 208 కుటుంబాలు, 850 పైగా జనాభా ఉంది. సీఎం రేవంత్‌రెడ్డి హయాంలో సీసీ రోడ్లు నిర్మించారు. జాతీయ రహదారి 163కి అనుకుని ఉండటంతో పర్యాటకుల కోసం రూ.20 కోట్లతో ప్రభుత్వం రెండు నెలల క్రితం టూరిజం హోటల్ మంజూరు చేసింది. ఇందులో మొదటి విడత రూ.10 కోట్లు విడుదలకు జీవోను విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. అలాగే కడా అధికారి పర్యవేక్షణలో గ్రామంలో పాఠశాల నూతన భవనం, సీసీ రోడ్లు, పరమేశ్వరుని ఆలయం వద్ద కల్యాణమండపం నిర్మాణానికి నిధుల వరద పారనుందని అధికారులు చెబుతున్నారు. తాజాగా నాలుగు పథకాల అమలులోనూ తమ గ్రామం ఆదర్శంగా ఉందనిహర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో రైతు భరోసా 305మంది రైతులకు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద 22 మందికి రూ.6వేలు చొప్పున మంజూరయ్యాయని చెబుతున్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద 210 దరఖాస్తులు రాగా, 101 మందిని అర్హులుగా గుర్తించారు. అర్హులందరికీ మంజూరుకానున్నట్లు భరోసా వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామంలో సంక్షేమం, అభివృద్ధి పథం వినిపిస్తున్నందుకు బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటనికి గ్రామ పంచాయతీ కార్యాలయంలో క్షీరాభిషేకం నిర్వహించారు. బాబయ్య, మాజీ ఉపసర్పంచు శ్రీనివాస్, రాజు, రాములు, శివ, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు సలామ్


మాకు వ్యవసాయ భూమి లేదు. నా భర్త మీరేసాబ్ గ్రామ పంచాయతీలో కార్మికుడిగా పనిచేస్తూ రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. కొడుకు దివ్యాంగుడు, కూతురు చదువుతోంది. ఆర్థిక పరిస్థితులకు సీఎం ఇచ్చిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా మొదటి విడత రూ.6వేలు ఖాతాలో పడింది. సీఎంకు సలామ్.

– సమీనా బేగం, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్ధిదారు

చిత్తశుద్ధితో పనిచేస్తాం


మా గ్రామాన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ఎంపిక చేయడం గర్వంగా భావిస్తున్నా. సీఎం రేవంత్ రెడ్డి అందించే ప్రతి పథకాన్ని, అభివృద్ధి పనులను అమలు చేయడంలో చిత్తశుద్ధితో పనిచేస్తాను. అధికారులు అందించే సలహాలు, సూచనలు పాటించి గ్రామస్తుల భాగస్వామ్యంతో అన్ని పకడ్బందీగా అమలు చేస్తాం.

– బసంత్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి

ఆనందంగా ఉంది


రాజకీయాలకు ప్రాధాన్యత నివ్వకుండా గ్రామం కోసం పనిచేస్తున్న మాకు అధికారులు, సీఎం రేవంత్ రెడ్డి సైతం ఊహించని ప్రోత్సాహం ఇస్తున్నారు. అభివృద్ధిలో ఆదర్శంగా ఉండేలా తీర్చిదిద్దడానికి ఎంపిక చేయడం ఆనందంగా ఉంది.

– శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచు

భరోసానిచ్చింది


నాకు 2ఎకరాల 28గుంటల వ్యవసాయ పొలం ఉంది. రైతు భరోసా కింద రూ.16,220 నా అకౌంట్‌లో జమ అయ్యాయి. పెట్టుబడికి చాలా ఇబ్బందిగా ఉన్న సమయంలో డబ్బులు అందాయి. నాలాంటి రైతులకు ఈ డబ్బులు ఎంతో భరోసా నిచ్చింది.

– వెంకటయ్య, రైతు భరోసా లబ్ధిదారు

బీజేపీతోనే దేశం అభివృద్ధి

పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు

పరిగి: బీజేపీతోనే దేశం అభివృద్ధి చెందుతుందని మండల అధ్యక్షుడు ఆంజనేయులు పేర్కొన్నారు. మండల పరిధిలోని ఇబ్రాహీంపూర్ గ్రామంలో ఎంపీ నిధులతో బోరు వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాలను పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తయినా గ్రామాలకు చేసిందేమి లేదన్నారు. గ్రామాల్లో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ప్రతీ అభివృద్ధి పనులు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులతోనే జరుగుతున్నాయన్నారు. దేశం బీజేపీ వైపు చూస్తుందన్నారు.

బొంరాస్‌పేటలో..

బొంరాస్‌పేట: గ్రామీణ సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ ధ్యేయమని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పరి జగదీశ్ పేర్కొన్నారు. శనివారం


బోరువేయిస్తున్న ఆంజనేయులు

కేంద్ర ప్రభుత్వం చేస్తున్న పథకాల అమలుపై మండల కేంద్రంలో బీజేపీ నాయకులు పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు మరింత మెరుగుపర్చుకోవాలన్నారు. అధికారుల పర్యవేక్షణ సైతం లోపించినట్లు తెలిసిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్దన్, దళితమోర్చా మండల అధ్యక్షుడు దప్పు జనార్దన్, అడివయ్య, అనంతయ్య, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి కేటీఆర్‌కు ఘన స్వాగతం


సోమన్‌గుర్తి గేటు వద్ద కేటీఆర్‌కు స్వాగతం పలుకుతున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

పూడూరు: వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల పరిధిలోని దాస్యానాయక్ తండాలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి వెళ్తున్న మాజీ మంత్రి కేటీఆర్‌ను మండల పరిధిలోని దేవనోనిగుడ, కెరవెళ్లి, సోమన్‌గుర్తి చౌరస్తాలో మాజీ సర్పంచ్ బుచ్చన్న ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్‌రెడ్డి, ఆనంద్, పట్నం నరేందర్‌రెడ్డి, తదితరులను గజమాలతో సన్మానించారు.

సర్వేకు సహకరించాలి

ఆర్‌ఐ గోవర్ధన్

మోమిన్‌పేట: రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు సర్వే అధికారులకు సహకరించాలని ఆర్‌ఐ గోవర్ధన్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని ఎన్కేపల్లిలో ఇంటింటికి వెళ్లి లబ్ధిదారుల వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దరఖాస్తుదారులు అన్ని ధ్రువ పత్రాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ప్రతిఒక్కరూ అధికారులు అడిగే ప్రశ్నలకు తగిన సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి తిరుపతమ్మ, ఫీల్డ్‌అసిస్టెంట్ అడివిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


దరఖాస్తుదారుని వివరాలు తెలుసుకుంటున్న ఆర్‌ఐ గోవర్ధన్

చిన్నషాపూర్‌ను జీపీగా ఏర్పాటు చేయాలని నిరసన

మొయినాబాద్: మొన్నటి వరకు పెద్దమంగళారం గ్రామ పంచాయతీకి అనుబంధ గ్రామంగా ఉండి కొత్తగా ఏర్పాటైన మొయినాబాద్ మున్సిపాలిటీలో కలిపిన చిన్నషాపూర్ గ్రామాన్ని ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. శనివారం గ్రామంలోనే గ్రామస్తులంతా బైఠాయించి నిరసన తెలిపారు. ప్రత్యేక రెవెన్యూ పరిధి ఉన్న చిన్నషాపూర్‌ను గ్రామ పంచాయతీగా చేయాలన్నారు. ఎన్నో ఏళ్లుగా అనుబంధ గ్రామంగా ఉన్న చిన్నషాపూర్ అభివృద్ధికి నోచుకోలేదని, గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేస్తే అభివృద్ధి జరుగుతుందన్నారు. మున్సిపాలిటీలో కలపడంతో చిట్ట చివరన ఉన్న తమ గ్రామాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోరన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు.

4న రథ సప్తమి వేడుకలు

కొడంగల్: పట్టణంలోని బాలాజీనగర్‌లో వెలసిన పద్మావతీ సమేత శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో 4వ తేదీన రథ సప్తమి వేడుకలను నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు తెలిపారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఉభయ దేవేరుల సమేత మలయప్ప స్వామివారు ఏడు వాహనాలపై భక్తులకు దర్శనమిస్తారన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలనంతరం తీర్థ ప్రసాదాలు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు.

ఏడు వాహన సేవలు

శ్రీవారు రథసప్తమిన ఏడు వాహనాలపై ఆశీనులై భక్తులకు దర్శనం ఇస్తారు. సూర్య ప్రభ, చిన్న శేష, గరుడ, హనుమంత, సర్వ భూపాల, కల్ప వృక్ష, చంద్రప్రభ వాహనంపై స్వామివారికి ముత్యాల పందిరి, తిరుమంజనం తదితర పూజలను ప్రత్యేకంగా నిర్వహిస్తారు. తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో ఈ ఆలయంలో వేడుకలను వైఖానస ఆగమ శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

బంట్వారం: కోట్‌పల్లి మండలం కంకణాలపల్లి గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను బీజేపీ నాయకులు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శివకుమార్, స్థానిక నాయకులు నర్సింలు, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

వీరభద్ర సేవకుడికి పాద పూజ

కొడంగల్: వీరభద్ర సేవకుడు గానుగాపురానికి చెందిన శంకరయ్య స్వామి శనివారం కొడంగల్‌కు వచ్చారు. ఆయన రాకను తెలుసుకున్న స్థానిక భక్తుడు పట్టణంలోని శివాజీ చౌక్‌లో శంకరయ్య స్వామికి సాదారంగా స్వాగతం పలికారు. అనంతరం పాదపూజ చేసి తరించారు. స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వీరభద్ర సేవకులు పరమాత్ముని భక్తులని పేర్కొన్నారు. స్వామివారి పాద సేవలో పట్టణానికి చెందిన జంగం చంద్రశేఖర్, హిందూ వాహిని జిల్లా కార్యదర్శి రాకేష్ కుమార్, బాకారం శేఖర్, నాగేషకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

కొందుర్గు: మండలంలోని ఉత్తరాసిపల్లిలో షాద్‌నగర్ పట్టణానికి చెందిన హ్యాపీ హాస్పిటల్ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ సందర్భంగా డాక్టర్లు శశికాంత్, సునీత రోగులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. శిబిరానికి హాజరైన 237 మంది రోగులకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు ఆనంఖాన్, రవీందర్, ప్రశాంత్, సన, గ్రామస్తులు అంజిరెడ్డి, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా మరుగుదొడ్లు

ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రయాణికులు


నిరుపయోగంగా మారిన మరుగుదొడ్లు, మూత్రశాలలు

నవాబుపేట: అధికారుల నిర్లక్ష్యం ప్రయాణికులకు శాపంగా మారింది. దీంతో ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోని మరుగుదొడ్లు, మూత్ర శాలలు నిరుపయోంగా మారాయి. ఏండ్లు గడుస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. ప్రయాణం మధ్యలో ఒకటి, రెండు వస్తే అటు వికారాబాద్, ఇటు శంకర్‌పల్లి వచ్చేవరకు ఊపిరి బిగపట్టుకొని ప్రయాణం చేయాల్సిన దుస్థితి నెలకొంది. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి నిరుపయోగంగా మారిన మరుగుదొడ్లు, మూత్రశాలలను ఉపయోగంలోకి తీసుకరావాలని కోరుతున్నారు.

కేటీఆర్‌ను కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు

కొడంగల్: మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు శనివారం మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్‌ను కలిశారు. కుల్కచర్లలో నిర్వహిస్తున్న బహిరంగ సభకు ఆయన వెళ్తున్న క్రమంలో పరిగిలో మాజీ ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి నివాసానికి వెళ్లారు. అక్కడ కొడంగల్ నియోజకవర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలు కలిసి స్థానిక సమస్యలను కేటీఆర్‌కు వివరించారు. ఈ నెలాఖరులో కొడంగల్‌లో బహిరంగ సభ ఏర్పాటు చేసి కార్యకర్తల సమస్యలు తెలుసుకుంటానని కేటీఆర్ హామీ ఇచ్చినట్లు బీఆర్‌ఎస్ నాయకులు తెలిపారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో తాజా మాజీ కౌన్సిలర్ మధుసూదన్ యాదవ్, శ్యాసం రామకృష్ణ, భీములు, కోట్ల యాదగిరి, మహేందర్‌రెడ్డి, సలీం తదితరులు పాల్గొన్నారు.

కుష్టువ్యాధి నివారణే లక్ష్యం



అవగాహన కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది

పీహెచ్‌సీ వైద్యురాలు రూబియానాజ్

యాలాల: కుష్టువ్యాధి నివారణే లక్ష్యమని యాలాల పీహెచ్‌సీ వైద్యురాలు రూబియానాజ్ పేర్కొన్నారు. శనివారం జాతీయ కుష్టువ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని బాలుర, బాలికల, కేజీబీవీ పాఠశాలల్లో అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు మాట్లాడుతూ..ఈ వ్యాధి మైకో బాక్టీరియం లెప్రే అనే బ్యాక్టీరియాతో సోకుతుందన్నారు. ఈ వ్యాధి తుమ్మడం, దగ్గడం వల్ల వ్యాప్తించే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ వ్యాధి లక్షణాలు కనిపించడానికి 3 నుంచి 5 సంవత్సరాల సమయం పడుతుందన్నారు. శరీరంపై స్పర్శ లేకపోవడం, రాగి రంగు మచ్చలు, కాళ్లు, చేతుల కండరాల బలహీనత, కళ్లు మూసుకుపోవడం తదితర లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు భువనేశ్వరి, స్రవంతి, సూపర్‌వైజర్ శోభా, సిద్ధయ్య, వరకుమార్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మార్కండేయ జయంతి


అనంతగిరి: మార్కండేయ జయంతిలో పద్మశాలి సంఘం ప్రతినిధులు

అనంతగిరి: అనంతగిరి గుట్టలోని మార్కండేయ ఆలయంలో శనివారం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మార్కండేయ జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉదయం నుంచే ప్రత్యేక పూజలు, అర్చన, అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

యాలాలలో..

యాలాల: కోట్ల మార్కండేయ ఆలయంలో ఉదయం 9 గంటలకు అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా గీతా పారాయణం చేపట్టారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు రవీందర్, ఉపాధ్యక్షుడు రాపోలు రాములు, మండల అధ్యక్షుడు వెంకట్, దూస వెంకటేష్, రమేష్, నరేష్, శేఖర్ పాల్గొన్నారు.

జగదీశ్వర్‌రెడ్డికి సన్మానం

కొడంగల్: కొడంగల్ మాజీ మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డిని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మురహరి వశిష్ఠ శనివారం సన్మానించారు. మున్సిపల్ పాలక మండలి పదవీకాలం జనవరి 26న ముగిసింది. గడిచిన ఐదేళ్లుగా కొడంగల్ మున్సిపల్ అభివృద్ధికి జగదీశ్వర్‌రెడ్డి ఎంతో కృషి చేశారని లయన్స్ క్లబ్ సభ్యులు కొనియాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్‌కు జగదీశ్వర్‌రెడ్డి మున్సిపల్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కొడంగల్ నియోజకవర్గం ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు మునీర్, భీంరాజు తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణకు డప్పుల దరువేద్దాం


అనంతగిరి: వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు సుభాష్‌మాదిగ

బొంరాస్‌పేట: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ ఉద్యమిస్తున్న ఎస్సీ వర్గీకరణకు డప్పుల దరువేద్దామని జిల్లా ఉపాధ్యక్షుడు సుభాష్ మాదిగ అన్నారు. శనివారం రేగడిమైలారంలో సమావేశం నిర్వహించారు. ఈ నెల 7న హైదరాబాద్‌లో నిర్వహించనున్న వేల గొంతులు లక్ష డప్పుల కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్, మండల కోకన్వీనర్ గోవర్ధన్, గ్రామ అధ్యక్షుడు ప్రశాంత్, మొగులయ్య, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్ రూరల్‌లో..

కొడంగల్ రూరల్: హైదరాబాద్‌లో నిర్వహించనున్న వేల గొంతులు లక్ష డప్పులు సభను విజయవతం చేయాలని జిల్లా ఉపాధ్యక్షుడు మల్కన్న, జిల్లా కార్యదర్శి ఆర్.అంజి పిలుపునిచ్చారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వివిధ దళిత సంఘాల నాయకులు రమేష్‌బాబు, మాజీ సర్పంచు రమేష్ బాబు, దస్తప్ప, మధు, శ్రీనన్న, యేసు, చిన్నయ్య, కాశప్ప, శైలు, సిద్ధు, అశోక్, నాగేష్, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ విడుదల

అనంతగిరి: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు సాంస్కృతిక ప్రదర్శన ర్యాలీని విజయవంతం చేయాలని ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఆనంద్ తెలిపారు. ఈ మేరకు సభ వాల్‌పోస్టర్‌ను శనివారం వికారాబాద్‌లోని ఎన్టీఆర్ చౌరస్తాలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రమేష్, ప్రకాష్, సుభాష్, నర్సింలు, భరత్, జగన్, శ్రీనివాస్, బందయ్య, విజయ్, రాజు, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

వెయ్యి గొంతులు లక్ష డప్పుల కార్యక్రమానికి పార్టీలకు, సంఘాలకు అతీతంగా తరలివచ్చి విజయవంతం చేయాలని దళిత సంఘాల నాయకులు మంచన్‌పల్లి సురేష్‌కుమార్ అన్నారు. ఈ మేరకు వికారాబాద్ క్లబ్ హాల్‌లో దళిత సంఘాల నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు.


బొంరాస్‌పేట: మాట్లాడుతున్న సుభాష్‌మాదిగ